క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



నర్సాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ ఫండ్ పథకం పేదలకు వరంలాంటిదని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా రెడ్డి అన్నారు. ఆదివారం ఆమె నర్సాపూర్‌కు చెందిన వాల్మీకి కుటుంబ సభ్యులతో పాటు నియోజకవర్గంలోని పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఆమె వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నయిూమొద్దీన్, బీఆ ర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, సూరారం నర్సింలు, సుధాకర్‌రెడ్డి, మహ్మద్, షేక్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

జనావాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్



రోడ్డును ఆనుకొని ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ పరిధిలోని జనావాసాల మధ్య రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. పట్టణ పరిధిలోని సిద్దిపేట రహదారిని గత ఏడాది విస్తరించగా.. చాలా వరకు కరెంట్, సోలార్ స్తంభాలను తొలగించారు. ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాల్సి ఉండగా, ఆ శాఖ అధికారులు ఎంతమాత్రం పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తారు రోడ్డును ఆనుకునే ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను వాహనాలు ఢీకొనే అవకాశం ఉంది. ఇకనైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

తిరుమల లడ్డూ పవిత్రతను దెబ్బతీయొద్దు



మాట్లాడుతున్న వీహెచ్‌పీ సభ్యులు

పెద్దశంకరంపేట(మెదక్): తిరుమల లడ్డూ పవిత్రతను దెబ్బతీయొద్దని వీహెచ్‌పీ ప్రఖండ అధ్యక్షుడు కన్నయ్యగారి శివశంకర్, ఖండ అధ్యక్షుడు కాజిపల్లి సంతోష్ అన్నారు. ఆదివారం పేటలో వీహెచ్‌పీ సభ్యులు మాట్లాడుతూ.. తిరుమల లడ్డూ విషయంలో ప్రజల అపోహలు తొలగించాలన్నారు. సనాతన హిందూ బోర్డు హిందువులకు అనివార్యమని, ముఖ్యమైన దేవాలయాల్లో అన్యమతస్తుల తొలగింపును స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో దాదిగారి సురేష్, పరం కిషోర్, వంశీ, ప్రవీణ్, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

సన్మానం



ఉత్తమ కవిగా ప్రశంసా పత్రం అందుకుంటున్న అనురాధ

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న నర్సు అనురాధ ఉత్తమ కవిగా సన్మానం అందుకున్నారు. సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం కామారెడ్డిలో ఆదివారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవిత పఠనం చేసిన నర్సు ఉత్తమ కవిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను వేదిక గౌరవ అధ్యక్షుడు రాంచంద్రం, ముఖ్య అతిథి రంగయ్య, అవధాని అంజయ్య సన్మానించి, ప్రశంసా పత్రం అందజేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ



కొల్చారం(నర్సాపూర్): దసరా పండగ సందర్భంగా వచ్చేనెల అక్టోబర్ మూడో తేదీ నుంచి మండలంలోని రంగంపేటలో నిర్వహించి శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఆదివారం గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రంగంపేట ఆశ్రమం (శ్రీ గురు మదనానంద ఆశ్రమం)లో భక్తుల సమక్షంలో ఆవిష్కరించారు.

ఉల్లినాట్లకు కరెంట్ కష్టాలు

- రేగోడ్‌లో వంద ఎకరాలకే పరిమితం
- ముందుకు సాగని పనులు
- ఇబ్బందుల్లో రైతులు



తాటిపల్లిలో ఉల్లినాట్లు వేస్తున్న రైతులు

రేగోడ్(మెదక్): ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం అడుగులు వేస్తున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. మా కష్టాలను తీర్చాలని అధికారులకు మొరపెట్టుకున్నా.. పట్టించుకునే నాథుడు కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వేళ కరెంట్ కష్టాలతో ఆర్థికంగా నష్టపోతున్నామని వాపోతున్నారు. జిల్లాలో 21 మండలాలు ఉండగా, ఇందులో గతేడాది 620 ఎకరాల్లో ఉల్లిపంటను సాగు చేశారు. ఈ ఏడు సుమారు 40 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారని, ఈసారి జిల్లాలో ఉల్లి సాగు తగ్గిందని అధికారులు చెప్తున్నారు. రేగోడ్ మండలంలో మాత్రం గతేడాది 540 ఎకరాల్లో ఉల్లిపంట సాగు చేస్తే.. ఈ ఏడు కేవలం 100 ఎకరాల్లోనే ఉల్లి పంట సాగు చేయగా, ఇంకా సాగుకు సిద్ధమవుతున్నారు. అయితే రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా ఉంటుంది. కానీ సాయంత్రం 4–45 నిమిషాలకు త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ఉల్లి నాట్లకు సమస్యలు వెంటాడుతునాయి. . 4:45 నిమిషాలకే త్రీ ఫేజ్ కరెంట్ పోవడం వలన ఉల్లి నాట్లు నిలిచిపోయి, కూలీలు ఖాళీగా కూర్చోవాల్సి వస్తోందని, ఆర్థికంగా వేల రూపాయలు నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. చీకటి పడే వరకు త్రీ ఫేజ్ కరెంట్ ఉంచాలని అధికారులను మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కూలీల ఖర్చులు భారం



రెండెకరాల్లో ఉల్లి పంట సాగు చేశా. ఉల్లి నాట్లు వేసే సమయంలో సాయంత్రం 4, 5 గంటల మధ్యలో కరెంట్ పోతోంది. దీంతో కూలీలు ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది. పని తక్కువ అవుతూ.. కూలీల ఖర్చులు మాత్రం ఎక్కువ అవుతున్నాయి.

– సోపాన్‌రావు, రైతు, తాటిపల్లి

ఏడు గంటల పాటు కరెంట్ ఉంచాలి



ఉల్లిపంట సాగు కోసం ఉల్లి నారు సిద్ధంగా ఉంచా. మరో రెండు రోజుల్లో ఉల్లి నాట్లు వేస్తా. సాయంత్రమే కరెంట్ కట్ చేయడంతో ఉల్లి నాట్ల పనులకు అంతరాయం కలుగుతోంది. ప్రభుత్వం స్పందించి ఏడు గంటల వరకు విద్యుత్ సరఫరా చేయాలి.

– అంజాగౌడ్, రైతు, తాటిపల్లి

యథేచ్ఛగా కాల్వల కబ్జా

- డబ్బు, పలుకుబడితో పూడ్చివేతలు



బహిరన్‌దిబ్బ గ్రామ రహదారి పక్కన ఉన్న కాల్వను జేసీబీతో పూడ్చివేస్తున్న దృశ్యం

అల్లాదుర్గం(మెదక్): డబ్బు, పలుకుబడితో వంద ఏళ్ల నాటి కాల్వలను పూడ్చి వేస్తూ కబ్జా చేస్తున్నారు. రోడ్డు పక్కనే ఉన్న భూములకు డిమాండ్ పెరగడంతో అక్రమార్కుల కన్ను పడి కబ్జాకు గురవుతున్నాయి. కట్టు కాల్వల ద్వారానే చెరువులోకి నీరు చేరుతోంది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు వీటి పక్కన భూములు కొనుగోలు చేసి, యథేచ్ఛగా కబ్జాలు చేస్తున్నారు. అల్లాదుర్గం మండలం బహిరన్‌దిబ్బ గ్రామంలోకి వెళ్లే రహదారి పక్కనే పెద్ద కాల్వ ఉంది. ఈ కాల్వ ద్వారా కుంటల్లోకి నీరు చేరుతోంది. కాల్వ పక్కనే భూమి కొనుగోలు చేసి, రియల్ ఎస్టేట్ వ్యాపారి కాల్వపై కన్ను పడింది. పట్టపగలే జేసీబీ, రెండు ట్రాక్టర్లతో మట్టిని కాల్వలో పోస్తున్నా.. ఎవరు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్ల పక్కన ఉన్న కాల్వలు పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉండటంతో సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు అక్రమంగా కాల్వలు కబ్జా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

టేక్మాల్‌లో ‘ప్రధానమంత్రి మన్ కీ బాత్’



మన్‌కీబాత్ వింటున్న నాయకులు

టేక్మాల్(మెదక్): మండలంలోని చల్లపల్లి (65–బూత్)లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు ఆదివారం వీక్షించారు. ఇందులో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లుపేట రాజు, టేక్మాల్ మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, భూత్ అధ్యక్షుడు నాగరాజు, మండల ఉపాధ్యక్షులు రాముడు, గిరిజన మోర్చా అధ్యక్షుడు సేనాపతి, టేక్మాల్ పట్టణాధ్యక్షుడు నాగరాజు, నాయకులు సుధాకర్, దండు మహేశ్, ఎల్లంపల్లి కృష్ణ, ఎల్లంపల్లి విష్ణువర్ధన్, ఎల్లంపల్లి దుర్గేశ్, ఎల్లంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కెమికల్ వ్యర్థాల కాల్చివేత

- సికింద్లాపూర్ ఆలయ సమీపంలో డంప్



వ్యర్థాలను తగులబెట్టడంతో వస్తున్న పొగ

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు వ్యతిరేకంగా ఇతర ప్రాంతాల నుంచి కెమికల్ వ్యర్థాలు తీసుకొచ్చి డంప్ చేసి కాల్చేస్తున్నారు. దీంతో వాయు కాలుష్యంతో భక్తులు, సమీప రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం సమీపంలో కెమికల్ వ్యర్థాలు నిల్వ చేస్తున్నారు. మనోహరాబాద్ మండలంలోని పలు కెమికల్ పరిశ్రమలకు సంబంధించిన వ్యర్థాలు లారీల్లో తీసుకొచ్చి డంప్ చేసి కాల్చివేస్తున్నారు. దీంతో దట్టమైన పొగతో ఆలయ పరిసరాలు తీవ్రమైన దుర్వాసన వస్తోంది. ఆదివారం డీసీఎం వాహనంలో తీసుకొచ్చిన కెమికల్ వ్యర్థాలు తగులబెట్టడంతో దుర్వాసన పొగ భరించలేక భక్తులు చాలా అవస్థలు పడ్డారు. పలువురు వ్యాపారులు కలిసి కెమికల్ వ్యర్థాలు డంప్ చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సంబంధిత అధికారులకు తెలిసినా.. చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు, భక్తులు వాపోయారు. ఈ విషయం గురించి పీసీబీ ఈఈ కుమార్‌పాటీ వివరణ కోసం ఫోన్ చేయగా స్పందించలేదు.

బీజేపీ సభ్యత్వ నమోదు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదును రాష్ట్ర నాయకుడు మురళీధర్‌గౌడ్ సమక్షంలో నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నట్లు మండల ప్రధాన కార్యదర్శి నరేశ్ మహంకాళి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ రాగి రాములు, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి రమేశ్, మండల సభ్యత్వ ప్రముక్ స్వామి, బూత్ అధ్యక్షుడు అంజయ్య, మహేశ్, ప్రవీణ్, అభిషేక్, దుర్గేశ్, నరేశ్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న నాయకులు

జగదాంబ, సేవాలాల్ ఆలయంలో పూజలు



కాడిపల్లిలో హోమం చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లిలోని జగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్ ఆలయంలో ఆదివారం గిరిజన స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాష్ట్ర పొరాదేవి ఆలయ అర్చకుడు బన్సీలాల్ మహారాజ్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద హోమం చేసి, భోగ్ బండార్ పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా తండాలకు చెందిన సేవాలాల్ దీక్ష తీసుకున్న గిరిజన స్వాములు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు శ్రీను, దశరథ్, ఇట్యానాయక్, లక్ష్మణ్, అంబర్‌సింగ్, రమేశ్, శంకర్, జవహర్‌నాయక్, దస్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామీణ అంతర్గత రోడ్లు బురదమయంగా ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలోని పలు కాలనీల్లో వర్షం కురిసినప్పుడల్లా దారి చిత్తడిగా మారుతోంది. దీంతో కాలి నడకన వెళ్లేందుకు సైతం ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ ఇబ్బందులను పలుమార్లు అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



బురద రోడ్డును చూపుతున్న గ్రామస్తులు

చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



అమ్మవారి సన్నిధిలో భక్తుల పూజలు



తునికి నల్లపోచమ్మదేవి ఆలయంలో ..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం మండలంలోని చిటుకుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఓడిబియ్యంతో మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

నల్ల పోచమ్మదేవి ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఇన్‌చార్జి ఈఓ, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేష్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారికి ఓడిబియ్యం, బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించి, వాహనాలకు పూజలు చేశారు. ఆలయ అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నర్సాపూర్: ఉపాధ్యాయులతో విద్యార్థుల బృందం



మెదక్ మున్సిపాలిటీ: పూర్వ విద్యార్థులు

నర్సాపూర్: పట్టణానికి చెందిన 2006–2007 విద్యా సంవత్సరం పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరూ ఆత్మీయంగా పలకరించుకొని, ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అప్పటి గురువులు లక్ష్మీనారాయణ, శివరాజ్, భాస్కర్, నాందేవ్, పెంటయ్య, కొండల్ తదితరులను సన్మానించారు.

42 ఏళ్ల తర్వాత..

రామాయంపేట(మెదక్): పట్టణంలో 1978– 1982 మధ్య కాలంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మండలంలోని అక్కన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయుడు రామచంద్రం ఆధ్వర్యంలో కలిశారు. వారంతా కలిసి జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులు శంకరయ్య, రఘురాంలు, మోహన్‌కుమార్, మోహన్‌రెడ్డి, బాలరాజు, హన్మంతును సన్మానించారు.

నిజాంపేటలో..

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1986–91 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలోని రేణుక గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులు వారికి విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆత్మీయంగా పలకరించి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లయ్య, బాలయ్య, రాజిరెడ్డి, జనార్దన్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

మెదక్ పట్టణంలో..

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని వెస్లీ కో–ఎడ్యుకేషన్ హై స్కూల్ 1993–94 పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 100 మంది విద్యార్థులతో పాటు అనాటి గురువులు, నాన్ టీచింగ్ స్టాఫ్ సమ్మేళనానికి హాజరయ్యారు. అనంతరం అధ్యాపకులు నర్సింగరావు, శ్రీనివాసరావు, స్వర్ణలత, కమల, వజ్ర, సత్యదాస్‌లను పూర్వ విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు విజయానంద్, జనార్దన్, చంద్రశేఖర్, ఆనంద్, ప్రభుదేవా, చరణ్, లాయక్, అలీఖాన్, జానీ, సులేమాన్, నర్సింలు, మధుసూదన్ తదితరులు ఉన్నారు.



రామాయంపేట(మెదక్): గురువులతో పూర్వ విద్యార్థులు



నిజాంపేటలో పూర్వ విద్యార్థులు

నిలిచిపోయిన రోడ్డు పనులు

- వాహనదారుల ఇబ్బందులు

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని చండి నుంచి గోమారం గ్రామం మీదుగా అనంతారం చౌరస్తా వరకు సింగిల్ రోడ్డుని డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.10 కోట్లు మంజూరైనవి. అందుకు సంబంధించి పనులు దక్కించుకున్న గుత్తేదారు రోడ్డు పనులు అసంపూర్తిగా చేస్తుండడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నవాబుపేట గ్రామ శివారు రోడ్డుపై నుంచి వర్షపునీరు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయం గురించి ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ వివరణ కోరగా.. పోతులబోగూడ నుంచి రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని నవాబుపేట వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



గోమారం-నవాబుపేట రోడ్డు దుస్థితి

ఎమ్మెల్యే పరామర్శ

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి–నారాయణ దంపతుల కుమారుడు సాయి నిఖిల్ వారం క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గౌరీ శంకర్‌గుప్తా, నాయకులు సంతోష్ కుమార్, గ్రామాధ్యక్షుడు దుర్గేశ్ తదితరులు ఉన్నారు.

అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మల్లేశం

నర్సాపూర్: అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో జరిగిన పార్టీ నర్సాపూర్ ఏరియా రెండో మహాసభలో ఆయన హాజరై మాట్లాడారు. స్థానిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. కొండపోచమ్మ కాలువ, ట్రిపుల్ ఆర్ కోసం భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని పార్టీ సమావేశంలో తీర్మానించారు. గ్రామ సభలు నిర్వహించి భూముల ధరలు నిర్ణయించి, రైతులకు పరిహారం చెల్లించాలని అన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి, ఇంటికి ఇల్లు, ఇంటికో ఉద్యోగం ఇవ్వాలన్నారు. నర్సాపూర్‌లోని పీజీ కాలేజీకి శాశ్వత భవనాలు నిర్మించాలని చెప్పారు. పలు గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రోడ్లను బాగు చేయాలన్నారు. అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. సమావేశంలో ఇంకా పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు నర్సమ్మ, నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి నాగరాజు, నాయకులు మల్లేశం, వాసు, గౌరయ్య, దాసు, పోచయ్య, సాయిలు, రాములు పాల్గొన్నారు.